# విధి వైపరీత్యం

## గొల్లపూడి సీతాదేవి

> అబద్ధం ఆడడం మహాపాపం అన్నారు. ఆ నోటితోనే ఏయే సందర్భాలలో అబద్ధం ఆడవచ్చో కూడా చెప్పారు. కాని, ఎంతటి మంచి ప్రయోజనం ఆశించి తప్పు చేసినా తప్పు తప్పే. బెడిసికొట్టక మానదు.

**సుదర్శనం** జాలిగా, బాధగా అనుకొన్నాడు స్వగతంగా: 'ఎందుకూ పనికిమాలినవాణ్ణి అయిపోయినాను. నాన్నకి సమయంలో ఏవిధంగానూ సహాయపడలేక పోతున్నాను. ఇందుకేనా తండ్రులు కొడుకుల్ని ప్రేమతో, ఆదరంతో, ప్రాణప్రదంగా పెంచి పెద్దచేసేది? పెద్దతనంలో తనువు నిచ్చిన తండ్రికి చెయ్యి అందించని కొడుకు ఉంటేనేం? ఊడితేనేం? నేనేం పాపం చేశాను నాన్న నన్ను తిరస్కరించటానికి?' అతని ఆక్రందనకు అర్థం లేకపోలేదు. తల్లి, తండ్రి, పెళ్ళికాని చెల్లి, చదువుకోవలసిన తమ్ముళ్ళు నిర్మలమయిన అతని హృదయ తటాకంలో బాధాకరమైన అలలు. పెళ్ళిళ్ళయి భార్యలతో బిడ్డల గోడులేక విలాసంగా జీవితాలు గడుపుతున్న అన్నలు నలకలు. భాస్కర్, శేఖర్ లెక్చరర్లు. విశేషంగానే ధనం సంపాదిస్తున్నారు. కూడబెడుతున్నారో తగలేస్తున్నారో తెలీదు కానీ, అడగనివాళ్ళది లోపంగా డబ్బేమీ మిగలదనీ, సరిపుచ్చుకోవటంగా ఉన్నదనీ వాపోతూంటారు. వదినెగార్లు కూడా సవిలాసంగా ఆ పోకడలను సమర్థిస్తూ ఉంటారు.

హైస్కూల్లో లెక్కల టీచర్‌గా రిటైరయాడు తండ్రి. ఉద్యోగ కాలంలో చెప్పుకోదగ్గంతగా వెనకవేసిందేమీ లేదు ప్రావిడెంటు ఫండు తప్ప. చివరి రోజులలో ఆదుకోకపోతుందా అని ఉపేక్షించి ఊరుకున్న కొద్దిపాటి స్థిరాస్తిని సమయం చూచి దాయాదులు ఆక్రమించారు. పదిమంది పిల్లలకు ట్యూషన్ చెబుతూ తీరిక సమయాల్లో సత్కాలక్షేపం చేస్తూ రోజులు దొర్లదీస్తున్నాడు తండ్రి. "సుఖపెట్టవలసిన రోజుల్లో ఇలా కష్టపెడుతున్నారేమయ్యా" అని ఎరిగినవాళ్ళు ఎవరైనా లాంఛనప్రాయంగా అన్నా సుదర్శనం తల భూమిలోకి కుంగిపోతున్నది. తనేం చెయ్యగలడు? తన చేతుల్లో ఏమున్నది? తనైనా రాధను తీసుకువచ్చిన కొత్తలో చాలా ఇబ్బందులే పడ్డాడు. కష్టాలే చవి చూశాడు. ఆంధ్రుల రాజధాని హైదరాబాదులో నివాసం. ఒక ఆంధ్రుణ్ణి ఆదరించలేదు రాజధాని. తనకేం పట్టనట్లు, తన బాధ్యతేమీ కానట్లు నిర్వికారంగా నిర్లిప్తంగా చూస్తూ ఊరుకున్నది. తోటి జీవులు గమనించనట్లే ఉన్నారు. రాధ గ్రహించింది. ఎవరికి పట్టకపోయినా రాధకు పట్టింది. త్వరలోనే 'భార్య భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు కాని, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోమనలేదు' అనుకున్నది స్వగతంలో. తక్షణం కార్యోన్ముఖురాలైంది. ఎందుకైనా మంచిదని తన ఆలోచన భర్తకు నివేదించింది ప్రకాశంగా. మొదట్లో అవ్యక్తంగానూ, తరవాత అయిష్టంగానూ, ఆశ్చర్యంగానూ, ప్రసన్నంగానూ అతని ముఖాన భావవీచికలు పరుగులెత్తాయి.

ఆమె అన్నది: "ఇందులో కించపడవలసిన అవసరమేమీ లేదు. అలాంటి విషయం కూడా కాదు. ఎవరికోసమో మనం కాదు. మనకోసం మనం. అనుమానపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు."

అతనికి నచ్చింది ఆమె చెప్పే విధానం. సమ్మతించాడు. బూజుపట్టిన వీణ పునరుద్ధరించి బాలికలకు సంగీతం ట్యూషన్ చెప్పటం మొదలు పెట్టింది. అతను నైట్ ట్యుటోరియల్ కాలేజీలో చేరాడు అధ్యాపకుడుగా. ఆమె కంఠం తిరిగినన్ని మెలికలు వీణకూడా అందుకోలేదు. ఆమెకున్న శ్రద్ధ తల్లికి కూడా ఉండదు. అందుకే విద్యార్థినుల సంఖ్య పెరిగింది. ఆమెకు తీరిక లేదు. అయినా ఆమెకు అశాంతి లేదు. అనంతమైన శాంతి, అంతులేని తృప్తి. అతనికే శ్రమ జాస్తి ఆమెకన్న. అయినా ఆమె సన్నిధానంలో అతనికి అలసట లేదు. ఆమె చిరునవ్వులలో అతనికి బాధలు లేవు. రోజులు వారాలుగా, వారాలు నెలలుగా రూపాంతరం చెందుతున్నాయి. కుదుటబడ్డది సంసారం. శ్రమ జీవితానికి అలవాటు పడ్డారు ఇద్దరూ. హాయిగా ఉన్న ప్రాణానికి ఏదో అంతర్లీనమైన అశాంతి. ఏదో ఆలోచిస్తుంటాడు ఎప్పుడూ. ఇల్లాలు ఊహించింది. ఆ ఊహ మాటల్లో పెట్టింది. "భగవంతుని దయవల్ల లోటు లేకుండా జీవిస్తున్నాం. మనకు చేతనయిన సహాయం చేద్దాం. కుమారుడుగా మీ ధర్మం మీరు నెరవేర్చుకోండి. ఎవరు కాదనగలరు? నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి—అందులోను మీ బాధ్యత—తోడ్పడటం కంటే కావలసిన దేమున్నది?"

విస్మయంగా చూచాడు ఆమె వైపు.

"లేదు నిజంగా." ఆమె అనునయించింది.

అయితే తన పదినెల మాటేమిటి? అంత కర్కశంగా ఎలా ఉండగలిగారు? రాధ మనస్సు మధువు. ఆమె ఆలోచనలు పూలతీవలు. అతను కృతజ్ఞత తెల్పాడు కళ్ళతో.

ఆమె నవ్వింది జాలిగా.

వెంటనే తండ్రికి పంపాడు పైకం. రావలసిన సమయానికి [illegible], రసీదు వచ్చింది. "నీవు పంపిన పైకం అందింది. ఇక ముందు ఎప్పుడూ ఇలా చెయ్యవద్దు. అనవసరంగా నీవు పట్నంలో బాధపడవద్దు." ఇతర క్షేమ సమాచారాలు ఉన్నాయి. అతననుకొన్నాడు: 'నేను కష్టపడతానేమోనని నాన్న బాధ. నేనంత స్వార్థపరుణ్ణి కానని నాన్నకు తెలియదు.' చిన్నగా నవ్వుకున్నాడు. మరుసటి నెలలో మరి కొంచెం పెద్ద మొత్తమే పంపాడు. ఈసారి వచ్చిన జాబుచూచి అతను ప్రాణ్వడి పోయాడు. "నీవు సహాయం చేసేంతటి స్థితికి దిగజారలేదు. ఈసారి పంపటానికి సాహసించవద్దు. ఖండితంగా చెబుతున్నాను." అతని హృదయం పాతాళంలోకి కుంగిపోయింది. 'ఏమిటి? నాన్న చివరికి నన్నిట్లా అర్థం చేసుకున్నారా? ఆధిక్యం చూపుకుంటున్నానని అపోహపడ్డారా?' అతని మనస్తాపానికి అంతులేదు. ఇంటికి వచ్చి రాధతో చెప్పాడు బాధగా. ఆమె ఆలోచించింది. ఆమె ఊహకేమీ అందలేదు. మామగారు అంత కఠినంగా అహంభావంగా ఉంటారని ఆమె అనుకోలేకపోయింది. ప్రస్తుతం నమ్మలేకపోయింది కూడా! కారణం తెలుసుకోవాలి. కాని అప్పటికి అతన్ని సాంత్వన పరిచింది. "మీరేం బాధ పడకండి. మీరు ఇబ్బంది పడతారని అలా రాసి ఉంటారు. అంతకన్నా మరేం లేదు." కాని ఇద్దరి మనసుల్లోను అది అంతర్లీనంగా కలత వేస్తూనే ఉన్నది. అపార్థం చేసుకోవటానికి ఇద్దరికీ మనస్కరించటం లేదు.

పెద్దన్నయ్య కూతురి బారసాలకు ఇంటికి వెళ్ళాడు సుదర్శనం భార్యా సమేతంగా. అప్పుడే అడిగింది అత్తగారిని ఆ విషయం రాధ.

"మరేం లేదమ్మా. వాడు జాలి గుండెవాడు. యుక్తాయుక్తాలు మరిచిపోతాడని మీ మామగారి భయం. అందుకని కొంచెం గట్టిగా రాస్తే కాని ఊరుకోడని. అంతకన్న మరేం లేదు."

సుదర్శనం ఆ ప్రస్తావనే ఎత్తలేదు. తిరిగి హైదరాబాదు వచ్చిన తరవాత అనుకొన్నాడు: 'ఇంట్లో జరుగుబాటు పూర్వానికి భిన్నంగా ఏమీ లేదు. పిల్లలు చదువులో వెనుకంజ వెయ్యటం లేదు. అయినా, నాన్న కెందుకో దిగులు. చిరునవ్వు పెదవులపై. నైరాశ్యం వదనంలో. తాను కారణమేమిటో అడగలేదు. తనకంత సాహసం లేదు. చిన్నతనంనుండి నాన్నంటే తనకేమిటో ఒక విధమైన భయం. అమ్మ దగ్గిర చనువే కాని ఆమె కేమీ తెలియదు. అమ్మతో నాన్న సంభాషించటమే అరుదు. అంతరంగిక విషయాల మాట చెప్ప నవసరమే లేదు.' రాధతో చెప్పుకున్నాడు తన గోడు. అంతకన్న తనకెవరు? ఆమె హృదయతతో విని సానుభూతితో అన్నది: "అవును. మీరన్నట్లు సంసారంలో మార్పేమీ లేదు. ఎందుకో అవ్యక్తంగా మామగారు బాధ పడుతున్న మాట నిజమే! బహుశః జానకి పెళ్ళి, చిన్నవారి భవిష్యత్తు వారి మనస్సులో బాధకు కారణం కావచ్చు." ఆవేశంగా మధ్యనే అడ్డుకున్నాడు. "నాలంత దురదృష్టవంతుడు మరొకడు ఉండబోడు."

"విచారించబోకండి. ఉపాయం ఆలోచిద్దాం." ధైర్యం చెప్పింది అప్పటికి ఆమెకేమీ తోచక పోయినా.

భోజనంచేసి బాధ్యత భార్యమీద పెట్టి నిశ్చింతగా నిద్రపోయాడు సుదర్శనం.

ఒకటి..... రెండు... దూరాన చర్చి గంటలు

మోగాయి. ఉలిక్కి పడింది రాధ. చటుక్కున ఓ ఆలోచన వెన్నుతట్టింది. దివ్యమైన ఆలోచన! భర్తతో చెబుదామని ఒత్తిగిలి చూసింది. నిర్మలంగా, గాఢంగా నిద్రపోతున్నాడు. పోనీ లేపటం ఎందుకు? ఉదయాన్నే చెప్పచ్చు. ఉత్సాహం ఉరకలు వేస్తున్నది; ఆనందం పొంగి పొరలుతున్నది. మరి కొద్ది క్షణాల్లో నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది రాధ.

మరునాటి సుప్రభాతాన భర్తకు కాఫీ ఇస్తూ చెప్పింది రాత్రి తనకు తట్టిన ఆలోచన.

"వండర్‌ఫుల్ ఐడియా! థాంక్యూ!" అన్నాడు ఆమె చెయ్యి ఉత్సాహంగా నొక్కుతూ. అతని కళ్ళకు ఆ ఉదయం లోకం అంతా నూతన కాంతులతో వెలుగుతున్నట్లున్నది. నవ్యోత్సాహంతో పరుగు లెత్తుతున్నట్లున్నది. రాధ దేవతలా కన్పిస్తున్నది. ఇక తనకేం కొదవ ఇలాంటి భార్య ఉండగా?

"ఆలస్యా దమృతం విషం. వెంటనే వ్రైస్తాను. సహజత ఉండద్దూ?"

"అలాగే! శుభం! వ్రైయండి." నవ్వింది.

సాయంత్రం అతను, ఆమె ఇంటికి చేరేప్పటికి టెలిగ్రామ్ మెసెంజరు ఉన్నాడు గుమ్మంలో.

"టెలిగ్రాం, సార్."

హడావిడిగా సంతకం చేస్తూనే "ఎక్కడనుంచి" అన్నాడు ఆదుర్దాగా. చెప్పాడతను. నిన్న ఉదయం తను ఇచ్చాడు. ఇవాళ సాయంత్రం అక్కడినుండి రావటానికి కారణం? విభ్రాంతితో, గాభరాతో మడతవిప్పి చూశాడు. చేతులు వణికాయి. కళ్ళు చీకట్లు కమ్మాయి. గభాలున కింద చతికిలబడ్డాడు. అతని అవస్థ గమనించి, "ఏమిటి?" అన్నది రాధ. అతని గుప్పిట్లో నలిగిపోతున్న గులాబిరంగు కాగితాన్ని తీసి చూచింది.

"ఫాదర్‌సీరియస్.స్టార్ట్ ఇమీడియట్లీ.భాస్కర్." ఆమెకు ఈ విషయం గొడ్డలి పెట్టులా ఉన్నది. మొదట కర్తవ్యోన్ముఖురాలయింది ఆమె. "లేవండి! త్వరగా ఓ టాక్సీ కేకెయ్యండి. రెండు నిమిషాల్లో వచ్చేస్తున్నాను."

అతను వీధిలోకి,ఆమె ఇంట్లోకి పరిగెత్తారు.ఐయిదు నిమిషాల్లో ఓ సూట్‌కేస్‌తో ఇద్దరు మనుషులుటాక్సీలో స్టేషన్ చేరారు. అతనికి ఆలోచనలతో బుర్ర బద్దలవుతున్నది. ఇంత అర్జెంటుగా ఎందుకిలా జరిగింది? ఇంతవరకూ ఎప్పుడూ నాన్న కులాసాగా లేరని కనీసం ఉత్తరమైనా వ్రాయలేదు, చివరికి టైఫాయిడ్ వచ్చినవుడైనా? ఇది అంతకన్నా ప్రమాదమా?

ఫూంకరించుకుంటూ బయలుదేరింది జి. టి. ఎక్స్‌ప్రెస్, అనేకులతోపాటు ద్వయాన్నికూడా ఎక్కించుకొని. రాధ ఊహాలు చింపిపోసిన కాగితపు ముక్కల్లా ఉన్నాయి. చెదిరిపోయే వాటిని ఒక చోటికి చేర్చటానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నది. కాని ఆమె ఆశ నెరవేరేటట్లు లేదు.

వెళ్ళేసరికి మామయ్యలు, అత్తయ్యలు, లన్నలు,వదినెలు అందరితోను ఇల్లు కిక్కిరిసి గందరగోళంగా ఉన్నది. వాతావరణం చూడగానే ఇద్దరి గుండెలు గుభేలుమన్నాయి. వేగం హెచ్చింది నడకలో. అది నడక కాదు పరుగు. సోదరులు, చెల్లి శోకమూర్తుల్లా ఉన్నారు. గ్రహించటానికి ఆట్టే సేపు పట్టలేదు. తండ్రి గదిలోకి పరిగెత్తారిద్దరూ. శూన్యంగా ఉన్న గది వారిద్దరిని



అపహాస్యం చేసినట్లుంది.

''అమ్మ ఏది?''

వంటిల్లూ, దొడ్డీ, పక్కగదులూ అన్నీ వెతికాడు సుదర్శనం. అతన్ని అనుసరించింది రాధ. అందరూ ఏదో సంకరిస్తున్నారు కాని అతనికేం వినపడటం లేదు. అమ్మ నాన్నలను గురించి ఎవరినయినా అడుగుదామనే ఊహ కూడా లేదతనికి. రాధ, జానకిని దగ్గిరికి తీసుకుని అడిగింది: ''ఏమిటమ్మా? అసలేం జరిగింది?''

''ఏముంది? నాన్నేమో ఆకస్మాత్తుగా పోయారు. అమ్మ అసలే గుండెజబ్బు మనిషి. ఈ షాక్ భరించలేక ఆ వెంటనే అమ్మకూడా మమ్మల్ని ఒంటరివాళ్ళను చేసేసి నాన్నవెంట వెళ్ళిపోయింది.''

రాధకు ఆశ్చర్యం వేసింది. ఒక్కరోజులో ఎంతమార్పు! ''అత్తగారు ఎంత అదృష్టవంతురాలు!'' అనునయ వాక్యాలతో ఆడబిడ్డలను, మరదుల్ని కూడా ఓదార్చింది. కాని భర్తను ఓదార్చటానికి ఆమెతరం కాలేదు. ధైర్యం చెప్పేందుకు ఆమెకు సాహసం కలగలేదు. చంటివాడిలా హృదయవిదారకంగా తల్లి తండ్రులను తలుచుకొని, తలుచుకొని ఏడుస్తున్నాడు. అన్నలు, వదినెలు రుమాళ్ళతో పమిటెచెరగులతో కళ్ళు ఒత్తుకుంటూ అనునయ వాక్యాలు పలికారు. వారి వారిక చివరి సాంత్వన వచనాలు అతని దుఃఖాన్ని ఆపలేక పోయాయి.

అంతలో చిన్నమేనమామ ఒక కవరు తెచ్చి సుదర్శనానికిచ్చాడు—''ఇది మీ నాన్న నీ కివ్వమన్నాడోయ్'' అంటూ.

అంతవిషాదంలోనూ అతన్ని విస్మయం ముంచెత్తింది. అన్నలకు కోపం అవధులు దాటింది; వదినెలకు కుతూహలం రేకెత్తింది. రాధకు కర్తవ్యం గుర్తు వచ్చింది. అతన్ని గోడవారగా తీసుకెళ్ళి కవరు చించింది. దానిలో సావుటావు వ్రాత కాగితం! దాన్ని అతని చేతుల్లో ఉంచింది. చదువుకుని కుప్పలా కూలిపోయాడు. కళ్ళు జేగురు వర్ణం దాల్చాయి. పిచ్చిగా జుట్టు పీక్కుంటున్నాడు. శరీరం వణికిపోతున్నది.

''నా దుర్మార్గానికి శిక్షలేదు; శిక్షలేదు. నన్ను క్షమించు, నాన్నా. అలా అనేందుక్కూడా నాకు అర్హత లేదు. నన్ను క్షమించవద్దు. క్షమార్హుణ్ణి కాదు.'' ఉద్వేగంతో గొణుగుతున్నాడు. కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

అతని చెయ్యి జారిపోయిన కాగితం రాధ అందుకు చూచింది. ''నాయనా! సుదర్శనం! లాటరీలో లక్ష రూపాయలు వచ్చినవని వైరిచ్చావు. చాలా సంతోషం. ఈ విషయం నన్నానంద పరిచినంత మరెవ్వరిని ఆనందింప చెయ్యదేమోకూడా? కారణం స్వార్థమే. మరొక టేమీ కాకపోవచ్చుకూడా. మీ పెద్దన్నయ్యకు ఈమధ్య లాటరీలోనే మొదటి బహుమతి వచ్చినట్లు తెలిసింది. వాడు వ్రాయలేదు. వాళ్ళిద్దరిది అదో తరహా. అనుకొని ఉపయోగం లేదు. నీవు సహాయం చేస్తానన్నప్పుడు నేనంగీకరించలేదు. ఎందుకని? నీవు అహం, అభిమానం అనుకొని ఉంటావు. అట్లా భావించిన ఎడల శుద్ధ పొరపాటే అవుతుంది. నీవు ఇబ్బంది పడి ఆలా చేయుటం నా మనస్సు ఒప్పుకోలేదు. చిన్నవాళ్ళు మీరు. పట్నవాసం కాపురం. అది అని ఇది అని ఇప్పుడే ముచ్చట్లు ఉండటం సహజం. తండ్రిననే ప్రేమతో, కృతజ్ఞతా భావంతో నీవు కనీసపు కోరికల్ని కూడా చంపుకుని



సౌరాష్ట్ర సౌభాగ్యవతి

ఫోటో—ప్రభాకర్ మహాదిక్ (బొంబాయి-29)

స్వార్థత్యాగం చెయ్యచ్చు. కానీ, ఈ విషయం నీ భార్యకు బాధగా ఉండచ్చు. ఇలా అన్నానని మరోలా అనుకోకు. రాధ విషయం నాకు తెలుసు. ఆమె అంత సహృదయురాలు మన కుటుంబంలోనే లేదు. కుర్రతనంలో కోరికలు సహజం కదా? మీరు సుఖంగా కాపురం చేసుకోవటమే నాకు కావలసింది. అంతకన్న కోరదగ్గది మాత్ర మేమున్నది ఈ వయస్సులో? అంతకన్న మరో కారణం లేదు. నీవు ఎప్పుడు నాకు పైకం పంపించావో అప్పుడే నా ఇహ బంధాలన్నీ సడలిపోయాయి. నీ వైరుతో సడలిన బంధాలు తేలిగ్గా విడిపోయాయి. ఇక నాకు నిశ్చింత. ఇన్నాళ్ళనుండి తమ్ముళ్లు, చెల్లి, మీ అమ్మ— వీళ్ళ బాధ్యతలు నాకు బంధాలు అయి బందీని చేశాయి. ఆ బాధ్యతలన్నీ నిర్విచారంగా సంతోషంగా సంతృప్తితో నీచేతుల్లో పెడుతున్నాను. ప్రత్యక్షంగా చెప్పే అవకాశం ఇవ్వటంలేదు నాకు మృత్యువు. పరోక్షంగానే నన్ను బంధ విముక్తుణ్ణి చేసిన నీకు నా మనఃపూర్వకమయిన ఆశీస్సులు.

నీ, తండ్రి.''

రాధ మాన్పడిపోయింది. మనస్తాపాన్ని తొలిగించబోతే మనిషే తొలగిపోయారు. విధి ఎంత క్రూరమైనది! ఈ ఘోరమైన నేరంలో తనూ భాగస్తురాలే. ఆమె చేతిలోని కాగితం ముక్కలుముక్కలయింది. శిథిలశకలాలు బందిఖానా వదిలించుకుని గాలిలో కలిసిపోయాయి స్వేచ్ఛగా. వాటిని సేకరించి దగ్గిరగా పరుద్దామనే ఊహ ఆమె కిప్పుడు లేదు.

సుదర్శనం పిచ్చిగా శూన్యంలోకి చూస్తున్నాడు. ★